## 'సరస్వతీ నమస్తుభ్యం .....'

"సరస్వతీ నమస్తుభ్యం, వరదే కామరూపిణీ, విద్యారంభం కరిష్యామి..." పిల్లలందరూ పాఠశాల ఆవరణలో నిలబడి ముక్త కంఠంతో సరస్వతీ స్తోత్రం పఠిస్తున్నారు. మూడు నిమిషాలసేపు ఆ పఠనం సాగితే కానీ మామూలు పాఠాలలోకి వెళ్ళే ప్రసక్తేలేదు. కనులు మూసుకుని భక్తి పారవశ్యంతో లక్ష్మి శ్లోకాలు చదువుతోంది. ముద్దులొలికే కంఠాలతో పిల్లలందరూ దానిని అనుసరించి చెబుతున్నారు.

సుమారు ఎనిమిది గంటలవుతోంది. ఇంకా ఎండపొర బయటపడకపోవటం వలన ప్రభాత వాతావరణం ఎంతో హృద్యమంగా వుంది. పాఠశాల ఆవరణలో బోలెడు చెట్లు, తరగతులన్నీ తాటాకుల పాకల్లోనే. ప్రదేశమంతా ఎంతో చల్లగావుంది. పాఠశాల వున్న నాలుగువేల గజాల స్థలంలోనూ తరగతిగదులేకాక ఖాళీ ప్రదేశంలో రకరకాల పాదులు, పళ్ళ మొక్కలు పెంచుతున్నారు. పిల్లలే కాయగూరల మొక్కలకూ, పాదులకూ, పూలమొక్కలకూ గొప్పులు తవ్వి బోదెలు కట్టి నీళ్ళుపోస్తారు నిత్యమూ. వాటి మీద వచ్చే ఫలసాయమూ వారిదే. అపురూపంగా పండించిన పువ్వులనూ, కూరగాయలనూ వారానికి ఓ జట్టు పిల్లలు తమ తమ ఇళ్ళకు తీసుకువెళ్తారు. మెరిసే కళ్ళతో తామువాటిని ఎలా పండించిందీ తమ తమ తల్లిదండ్రులతో వివరించి చెబుతారు. అ మెరిసే కళ్ళల్లోని తృప్తిని చూడవలసిందే మరి.

ఆరు సంవత్సరాల క్రిందట నేను 'బియ్యీడీ' కోర్సు పూర్తి చేశాను. కోర్సులో వుండగానే నా సహాధ్యాయి లక్ష్మిని పెళ్ళిచేసుకున్నాను. ఆమె కోరికల రూపమే ఈ ఆదర్శపాఠశాల. బియ్యీడీ అయిన తరువాత ఇద్దరం ఉద్యోగాల కోసం ఎగబడకూడదనీ, స్వంతంగా ఓ ఆదర్శపాఠశాల స్థాపించి నడపాలనీ, ముందుగానే నిర్ణయించుకున్నాం. అయితే ఆ ఆలోచన ఆచరణలోనికి తీసుకురావడం అంత సులువయిన విషయం కాదని తరువాతి రెండు సంవత్సరాలలో ప్రత్యక్షంగా తెలుసుకున్నాం. ఈలోగా నాన్న నాకు మిగిల్చిన ఎకరం పొలం, లక్ష్మి మెడలోని బంగారుగొలుసు కరిగిపోయాయి. ఎలాగయితేనేం ఊరికి దూరంగా ఓ ఎకరం స్థలం లీజుకు తీసుకుని పాఠశాలకు అవసరమయిన పాకలు వేయటం పూర్తిచేశాం. ప్రాథమిక స్థాయిలో తరగతులు ప్రారంభించి, ఈ నాలుగయిదేళ్ళలో మెట్రిక్ కోచింగ్ వరకూ రకరకాల తరగతులు నిర్వహించడం జరుగుతోంది.

మా యిద్దరితోబాటు మరో అయిదుగురు ఉపాధ్యాయుల సహకారమూ మాకు లభించింది. మా అందరికీ నిత్యకృత్యానికి లోటులేకుండా స్కూలుమీద వచ్చే ఆదాయం

సరిపోతోంది.

ప్రార్థన పూర్తిచేసి పిల్లలందరూ ఎవరి తరగతి పర్ణశాలలకు వాళ్ళువెళ్ళిపోయారు. పాఠశాల ఆవరణ గేటుమూసి తాళం బిగించటానికి అటువైపుకు వెళ్ళేను. దూరంగా ఓ పాప పరుగెత్తుకుంటూ వస్తూ కనిపించింది. ఆమెలోనికి వచ్చేవరకు ఆగి, ఇంకలోనికి వచ్చే విద్యార్థులెవ్వరూ కనుచూపుమేరలో లేరని నిర్ధారించుకుని, గేటుకు తాళం పెట్టబోతూవుంటే దూరంలో వడివడిగా అడుగులు వేసుకుంటూ, ఓ చేతిలో బ్రీఫ్‌కేసుతో ఇటే వస్తున్న ఓ వ్యక్తి కనిపించేడు. అనుమానంగా అతనివైపు చూస్తూ వుండిపోయాను. ఆ వ్యక్తి నిమిషంలో నాకు చేరువయ్యాడు. దగ్గరకు వచ్చేక నన్నుచూసి ఓ చిరునవ్వు చిందించేడు. పెదాలు రెండూ చెవులదాకా విడిపోయేలా నవ్వే ఆ వ్యక్తి చటుక్కున గుర్తుకు వచ్చేడు అతడు ధర్మతేజ!.

ధర్మతేజ బియ్యీడీ కోర్సులో మా సహాధ్యాయి. రాయలసీమ మండలం వైపువాడు. రాయలసీమ నుండి రాజమండ్రి కాలేజీకి రావటానికి ఏవేవో కారణాలు చెప్పేడు అప్పట్లో! ధర్మతేజ మంచి మాటకారి. ఆ మాటకారి తనంతోనే ట్రయినింగు స్కూలులో మా విద్యార్థులందరికీ నాయకత్వం వహించేడు. విద్యార్థి సంఘానికివేలమీద నిధులు సమకూర్చేడు. బెనిఫిట్‌షోలు నిర్వహించటం ద్వారా ఆర్కెస్ట్రా బృందాలను రప్పించి ప్రదర్శనలు ఏర్పాటు చేయించి, టిక్కెట్లు అమ్మటం ద్వారా; ఇలా పలురకాలుగా ఈ నిధులు సమకూర్చేడు. తొమ్మిదినెలలు తిరిగేసరికి ధర్మతేజ ఇటు విద్యార్థులలో మంచి పట్టు, అటు అధికారులలో మంచి పలుకుబడి సంపాదించేడు.

నా స్వంత విషయంలో కూడా ఒకటి రెండు పర్యాయాలు ధర్మతేజ నాకు సహాయం చేశాడు. ముఖ్యంగా నేను నా సహాధ్యాయి లక్ష్మిని వివాహం చేసుకునే విషయంలో మాఇంట్లో అడ్డంకులు ఎదురయితే, మా నాన్నకు సర్దిచెప్పింది ధర్మతేజ.

అయితే మాట్రయినింగ్ పూర్తి కాకుండానే పదినెలలు తరువాత హఠాత్తుగా మాయమయ్యాడు ధర్మతేజ! కుటుంబ పరమయిన ఇబ్బందులు ఏర్పడటంతో తన స్వంత వూరు అయిన మదనపల్లె వెళ్ళిపోయాడని అతని అంతరంగికులు చెప్పేరు. సేకరించిన నిధులుకూడా కొన్ని కనబడటం లేదని కొంతమంది చెవులు కొరుక్కున్నారే తప్ప బహిరంగంగా మాట్లాడే ధైర్యం మాత్రం ఎవ్వరికీ లేకపోయింది. త్వరలోనే ధర్మతేజ తిరిగి వచ్చేస్తాడని అందరూ అనుకున్నారు కానీ మా ట్రయినింగు పూర్తయ్యే వరకూ అతడు తిరిగిరాలేదు. ఆ తరువాత కూడా అతడిని గురించిన సంగతులు ఏనాడూ నేను వినలేదు. కనీసం మా మిత్రులలో ఎవరికయినా ఓ ఉత్తరం రాసిన వైనమూ తెలియలేదు.

అదిగో, ఆ ధర్మతేజ ఆరు సంవత్సరాలు తర్వాత అనుకోకుండా ఇలా అవతరించేడు!.

"హాయ్! బాగున్నావా బాబూరావ్! నన్ను గుర్తుపట్టలేదా? ధర్మతేజని" అన్నాడు దగ్గరకు వస్తూ.

మాటల్లో అదే హుషారు! గొంతులో అదే జీర ! మార్దవం తక్కువ, మోటుదనం ఎక్కువ!! సన్నటి మీసకట్టు బొద్దుమీసాలకట్ట అయింది. కళ్ళల్లో ఎరుపుజీర. మనిషి మరింత నలుపయ్యాడు ఓ కాలు కాస్త ఈడుస్తూ నడిచే ,నడక తరహాలో మాత్రం ఏమార్పులేదు. "ఎందుకు గుర్తులేదూ? ఎక్కడ నుండి రావటం? లోపలకురా" అంటూ అతని చేతిలోని బ్రీఫ్‌కేసును అందుకుని మరో చేతితో గేటుకు తాళం బిగించేను.

"నువ్వు నడుపుతున్నది స్కూలా? సెంట్రల్ జైలా" అడిగేడు నవ్వుతూ

నేను కూడా చిన్నగా నవ్వేశాను "బాబూరావ్ ఇదేం బాగాలేదయ్యా" అన్నాడు మళ్ళీ

"ఏది బాగులేదు?"

"పిల్లల స్కూలుకి ఇలాగేట్లు బిగించి తాళాలు పెట్టడం... మనం ప్రజాస్వామ్యంలో బ్రతుకుతున్నాం" అన్నాడు.

"మనం ప్రజాస్వామ్యంలో బ్రతుకుతున్నాం. నిజమే పశువులు కూడా అలాగే బ్రతుకుతున్నాయి. గేటు వెయ్యకపోతే ఇష్టారాజ్యంగా లోనికి వచ్చి పిల్లలు ఎంతో శ్రద్ధతో పెంచే పాదుల్నీ, మొక్కలను తినేస్తాయి. వాచ్‌మెన్‌లను పెట్టుకునే స్తోమత మాకింకారాలేదు. మేమే గంటలు కొట్టుకుని, మేమే గేట్లు వేసుకుని తీసుకుంటున్నాం. పిల్లలకి క్రమశిక్షణ రీత్యా కూడా కొంతవరకూ ఇది అవసరమే. సరే ... పద... ఇంట్లోకి వెళ్దాం స్నానం చేద్దువుగాని..." అంటూ పాఠశాల వెనుక భాగంలో గల ఇంటివైపుకు నడిచేను.

"లక్ష్మిగారు ఎలా వున్నారు?" అడిగేడు

"బాగానే వుంది. ఈ మోడల్ స్కూల్ ప్లాన్ అంతా తనదే .... తనే నాకంటే ఎక్కువ శ్రద్ధ తీసుకుంటుంది స్కూలు విషయంలో..." అన్నాను.

"ఔను మీ సంగతులన్నీ పదిరోజుల కిందటే విన్నాను. మీ స్కూలు జిల్లా విద్యాధికారుల ప్రశంసలు పొందిందనీ, జిల్లా కలెక్టరుగారు మిగిలిన స్కూలు నిర్వాహకులకు మీ స్కూలును ఒక 'రోల్‌మోడల్'గా తీసుకొమ్మని చెబుతున్నారని కూడా తెలిసింది".

"నువ్వీ విశాఖపట్నంలో అడుగుపెట్టి ఎన్నాళ్ళయిందేమిటి? అప్పుడే అన్ని విషయాలు సేకరించావు" నవ్వుతూ అన్నాను.

"నేనీవూరు వచ్చి పదిరోజులుపైనే అయింది. మరో పదిహేను రోజులు వుండాల్సిన పనులున్నాయి. మీ ఇంట్లోనే బస" అన్నాడు.

"తప్పకుండా" అంటూ ఇంటి వెనుక భాగంలోని గెస్టురూం చూపించాను.

"మొహమాటపడకు, నీ ఇల్లే అనుకో. కాకపోతే మా ఇల్లు పర్ణశాల... కాస్త తలదించుకుని లోనికి దూరాలి! అంతే!" అన్నాను.

అతడి స్నానం పూర్తయిన తర్వాత భోజనం ఏర్పాటు చేయబోతే వద్దని వారించేడు. భోజనం విషయంలో మాత్రం నన్ను బలవంతం చెయ్యొద్దు. నేను ఏ పనుల మీద ఎక్కడికి తిరుగుతానో, ఏ వేళప్పుడు ఎక్కడ వుంటానో నాకే తెలీదు. అందువలన చెప్పిన సమయానికి రావటం నాకు కుదరకపోవచ్చు. వేళకానివేళ వచ్చి మీకు ఇబ్బంది కలుగజేయటం నాకు ఇష్టం లేదు. వెళ్ళేలోగా ఏదో పూట మీతో కలిసి తింటానులే, నువ్వు మరోలా భావించకు. పర్ణశాలకు మల్లే వున్నా, ఈ గెస్టురూం నాకెంతో నచ్చింది. సరే, రాత్రికి అంతా వివరంగా మాట్లాడుకుందాంలే" అంటూ డ్రెస్ వేసుకుని బయటకు బయలుదేరాడు.

స్కూలు వెనుకభాగంలోని మరోగేటు చూపించి దాని తాళంచెవి అతనికి ఇచ్చేను "ఈగేటులోంచి ఏ వేళకయినా నువ్వు రావచ్చు! వెళ్ళొచ్చు! రాత్రి ఆలస్యమయినా నీకు సమస్య వుండదు" అన్నాను. ధర్మతేజ తాళం అందుకుని బ్రీఫ్‌కేసులో పడేసుకుని బయలుదేరి వెళ్ళిపోయాడు. ఆవేళ లంచ్ సమయంలో ధర్మతేజ రాక వివరాలు లక్ష్మికి చెప్పేను.

ఆ రాత్రి తొమ్మిదింటికి తిరిగి వచ్చాడు ధర్మతేజ. కలక్టరుగారి పి.ఎ.తో డిన్నర్ అయిందిట. తోటలో కుర్చీలు వేసుకుని కూర్చున్నాం. లక్ష్మిలోపలనుండి వచ్చి ధర్మతేజను పలకరించి, తర్వాత స్కూలు రికార్డులు నింపవలసిన పని వుందని ఆఫీసురూంలోకి వెళ్ళిపోయింది. సుమారు రాత్రి పన్నెండు గంటలవరకూ ధర్మతేజ తనను గురించిన ముచ్చట్లు ఏవేవో చెప్పేడు.

అప్పట్లో బియ్యాడీలో వుండగా ఇంటి పరిస్థితులు బాగాలేక అర్థంతరంగా కోర్సు మానేసి, వెళ్ళిపోవలసి వచ్చిందట. తండ్రి హఠాత్తుగా చనిపోతే కుటుంబ భారమంతా పెద్ద కొడుకయిన తనమీద పడటంతో బియ్యాడీ పూర్తిచేయలేకపోయానని చెప్పేడు. తర్వాత అనేక రకాల ఉద్యోగాలు చేసినా అవేవీ తనకి తృప్తికల్గించలేదట. నెలకి నాలుగయిదు వేలు మిగలటమే కష్టమయిపోయేదట.

అతని మాటలకు ఆశ్చర్యపోవటం నావంతయింది. నెలకు నాలుగయిదు వేలు చాలదా? "ఇన్ని పాట్లూపడి ఈ స్కూలు నడుపుతున్నాం. మొత్తం ఏడుగురం వున్నాం ఇందులో మాకు మాత్రం ఏం మిగిలిపోతోందని? నిర్వహణ ఖర్చులుపోను అరకొరగా నెలకి, తలో పదిహేనువందలూ మిగిల్తే గొప్పే, అనుకుంటున్నాం" అన్నాను.

కొంతసేపు ధర్మతేజ మాట్లాడలేదు. 'ఈ మోడలు స్కూలులో నేను ఏదో లక్షలు

మూటగట్టేసుకుంటున్నట్లు ధర్మతేజ భావిస్తున్నాడు' అని నాకు అనిపించింది.

"అది నిజమే కావచ్చు. ఈ రకంగా స్కూలు నడిపితే అంతకంటే మిగలటం కష్టమే. ఈ మొక్కల పెంపకాలు, పాడుల పెంపకాలు, తేనెటీగల పెంపకాలు అంటూ మళ్ళీ నీటికి మోటరు, పంపులు, ఇలాంటి వాటికన్నిటికీ ఖర్చవుతుంది కదా! ఈ చాదస్తాలు అన్నీ మానేసి పిల్లలకి పాఠాలు మాత్రం చెప్పి పంపించవచ్చుకదా" అన్నాడు.

"ఎందుక్కాదు! అలాగా చెయ్యొచ్చు కానీ మోడలుస్కూలుగా నడుపుదామని కదా, మా తాపత్రయం. చదువుతోబాటు పిల్లలు బాల్యం నుండీ పరిసరాల పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణ మొదలయిన విషయాల గురించి తెలుసుకోవాలి. వారు భవిష్యత్తులో బాధ్యతగల మంచి పౌరులుగా రూపొందాలి. అందుకే ఈ ఏర్పాట్లన్నీ. త్వరలోనే సౌరశక్తి పరికరాలు. చిన్న విండ్‌మిల్ మొదలయినవి కూడా ఏర్పాటు చేయాలనుకుంటున్నాం. ప్రకృతిని ధ్వంసం చేయకుండా, ప్రకృతి వనరులను వినియోగించుకుంటూ బతకటం వారికి నేర్పాలి. ఇప్పటికే మనం పర్యావరణాన్ని బోలెడంత పాడుచేశాం. ముందు తరాలయినా దీన్ని గురించి జాగ్రత్తపడుతూ, భావితరాలకైనా ప్రకృతి వనరులను ఎలా సంరక్షించి మిగల్చాలో వారికి తెలియచెప్పాలికదా" అన్నాను కాస్త స్థిరమైన గొంతుతో. కొంతసేపు మాట్లాడలేదు ధర్మతేజ.

తర్వాత "బాగుంది బాబూరావ్ నీ ఆలోచనా ధోరణి మారలేదు. ఇంతకీ ఏయే క్లాసులు నడుపుతున్నావ్?"అంటూ అడిగేడు. "మామూలు తరగతులు ఒకటినుండీ మెట్రిక్ వరకూ, ఇవికాక ప్రత్యేక కోచింగ్ క్లాసులు చెబుతాం. అవి ఏడాదికి రెండు నెలలు మాత్రమే, అంతే. ఈ విశాఖపట్నంలో ఆక్స్‌ఫర్డ్, లిటిల్ టెంపుల్స్ మొదలయిన ఇంగ్లీషు మీడియం స్కూళ్ళు ఓ నాలుగువున్నాయి. వాటిలో మొదటి స్టేండర్డ్‌లో చేరాలంటే విధిగా ఎంట్రెన్సు రాయాలి. ఓరల్‌గా వాళ్ళ ఇంటర్వ్యూలో సమాధానాలు చెప్పాలి. అందుకు తగ్గ తర్ఫీదు మేం రెండునెలలబాటు చిన్న పిల్లలకి ఇస్తాం. నిజానికి ఈ కోచింగ్ ఇచ్చిన రెండు నెలల్లోనే మాకు కాస్త డబ్బు మిగిలేది".

"ఎందుకని?" నా మాటలకు అడ్డుతగిలేడు ధర్మతేజ.

"ఈ వూళ్ళో ఆ నాలుగు స్కూళ్ళే పేరు పొందినవి. డబ్బున్న వాళ్ళందరూ తమ పిల్లల్ని ఆ స్కూళ్ళలో చేర్పటానికి ఆరాటపడతారు. ఒకసారి వాటిల్లో చేరిస్తే ప్లస్ టూ వరకూ ఇంక చూసుకోనక్కరలేదు. ఆ స్కూళ్ళల్లో పిల్లలకే మెడికల్, ఇంజనీరింగ్‌లలో ఎక్కువ సీట్లు వస్తున్నాయి. వాటిలో ఫీజులు కూడా చాలా ఎక్కువే. అయినా తమ పిల్లల భవిష్యత్తు కోసం డబ్బు ఖర్చు చేయటానికి జనం వెనకాడటంలేదు. ఆ స్కూళ్ళల్లో తమ పిల్లలు చదువుతున్నారని చెప్పుకోవటం తల్లిదండ్రులు తమ స్టేటస్ సింబల్‌గా

భావిస్తున్నారంటే, ఆ స్కూళ్ళసీట్ల కోసం వుండే 'క్రేజ్' ఎంతో నీకు అర్థమవుతుంది. అందుకని ఆ స్కూళ్ళలో జాయిన్ చేయటానికి ఎంట్రెన్సుకోచింగ్ ఫీజు అయిదువందలు అయినా జనం ఎగబడి చేరటానికి సిద్ధపడుతున్నారు. మేం మాత్రం ఏడాదికి పాతికమంది పిల్లల్ని మాత్రమే చేర్చుకుని వారియెడల రెండు నెలలూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ కోచింగ్ ఇస్తున్నాం. ఈ పాతికమందిలోనూ కనీసం ఓ అయిదుగురారుగురికి సీట్లు వస్తున్నాయి..." అన్నాను.

ధర్మతేజ నావంక ఆశ్చర్యంగా చూశాడు. "పాతిక మందికి కోచింగ్ ఇస్తే అయిదుగురారుగురికేనా సీట్లు వచ్చేది?" అంటూ కాస్త నిరసన స్వరంతో అడిగేడు.

"అవును! ఆ స్కూల్స్ చాలా స్ట్రిక్టు. వాటిలో సీటు దొరకటం గగన కుసుమం"

"నిజమా?" సీరియస్‌గా అడిగేడో, హేళనగా అడిగాడో నాకర్థం కాలేదు.

"ఔను... కొన్ని కోచింగ్ సెంటర్‌ల నుండి వందమంది పిల్లలను పంపినా, ఒక్కరికీ వాటిల్లో సీటు దొరకని సందర్భాలున్నాయి. మేం బాగా మెరుగే" అన్నాను.

ధర్మతేజ తలపంకించి ఆలోచనలో వుండిపోయాడు కొంతసేపు. రెండు నిమిషాల మౌనం తర్వాత అడిగేడు. "ఈ వూళ్ళో అలాంటి పెద్ద స్కూళ్ళు నాలుగింట్లోనూ మొత్తం ఫస్టు స్టాండర్డ్ సీట్లు ఏమాత్రం వుంటాయి? ఆఫ్‌కోర్స్ అన్నీ కలిపి"

"నాలుగు స్కూళ్ళల్లోనూ మొత్తం సీట్లు అయిదువందలు" అన్నాను.

"మొత్తం అయిదువందలసీట్లు వుంటే, నువ్వువాటికి అయిదుగుర్ని మాత్రమే పంపగలుగుతున్నావా? అంటే మొత్తం ఆ సీట్లలో వందోవంతు మాత్రమేనా?"

"అవును అంతే" అన్నాను కొంచెం బిడియపడుతూనే

"నువ్వు స్కూలు నిర్వహించే తీరులో ... ఐమీన్... ఎంట్రెన్స్ కోచింగ్ ఇచ్చే తీరులో ఏదో లోపం వుంది." అంటూ మాటలు ఆపేడు. మొహం మీద అరచేత్తో కొట్టినట్లు అలా మాట్లాడినా, అందులో నేను నష్టపోతున్నాననే బాధతో అతడు మాట్లాడినట్లే నాకనిపించింది కానీ నాలోపాన్ని ఎత్తిచూపినట్లు మాత్రం నాకనిపించలేదు.

అందుకే నేను బాధపడలేదు.

అయినా ధర్మతేజ మాట్లాడే పద్ధతి నాకు కొత్తకాదు కదా! కొన్ని సమయాలలో కట్టెవిరిచి పొయ్యిలో పెట్టినట్లు మాట్లాడటం అతనికి పరిపాటే. కొంతసేపు మౌనంగా వుండిపోయాను.

నా మౌనం నా మనసుకు తగిలిన గాయంగా అనుకున్నాడు కాబోలు మళ్ళీ తనే అన్నాడు "నువ్వు మరోలా అనుకోకు పాతికమందికి నువ్వు కోచింగ్ ఇచ్చి పంపిస్తే కనీసం ఇరవైమంది సెలెక్టు కావాలి. మనం రాయి విసిరితే పండురాలాలి అంతే"

తన మనసులో ఏదో పథకం రూపుదిద్దుకుంటున్నవాడిలా ఆలోచిస్తూ, తల ఇటూఅటూ ఆడిస్తూ మాట్లాడేడు.

అతని మాటలకు మనసులోనే నవ్వుకున్నాను. ధర్మతేజ పిల్లకాకి! వుండేలు దెబ్బలు తినలేదు. తిని వుంటే తెలిసివుండేది. స్కూలు ఆరంభించటానికి మొదటి రెండు సంవత్సరాలూ నేనూ లక్ష్మీ పడిన పాట్లు ఇతడికెలా అర్థమవుతాయి.? అయినా ఎంట్రెన్సు పరీక్షలకు పంపేటపుడు మనం పంపే పిల్లలందరూ సెలెక్టవుతారని గేరంటీ ఏమిటి? అయిదేళ్ళ వయసు పిల్లలకి ఎవరయితేమాత్రం ఎంతని శిక్షణ ఇవ్వగలరు?

గత ఆరు సంవత్సరాలలోనూ ధర్మతేజ, తాను చేసినట్లు ఏకరవుపెట్టిన ఉద్యోగాలు జాబితాలో ఉపాధ్యాయవృత్తి పేరు ఎక్కడా విన్పించలేదు. వాషింగ్‌మిషన్ల అమ్మకాలు, గ్రైండర్ల అమ్మకాలు, మందుల కంపెనీ రిప్రజెంటేటివ్ అదెక్కడో అసిస్టెంటు సేల్సు మేనేజరు; ఇలాంటి ఉద్యోగాలే వెలగబెట్టినట్లు, చెప్పేడు. అలాంటి ధర్మతేజ తనకు బొత్తిగా పరిచయంలేని ఈ ఫీల్డు గురించి అలా మాట్లాడటంలో వింతకూడా లేదు. పళ్ళపొడిపేకెట్లు అమ్మటం అంతసులువనుకుంటున్నాడా పసివాళ్ళకి పాఠాలు చెప్పటం?!

చీకట్లో నా ముఖకవళికలు పసిగట్టినట్లు లేదు అతడు.

అసహనంగా సమాధానాలు ఇవ్వాలనుకున్నా, అతడు ప్రస్తుతం నా అతిథి కావటం వలన ఆ ఆలోచన విరమించుకుని మనసు సంబాళించుకున్నాను. “ధర్మతేజా ఆ స్కూళ్ళల్లో సీట్లు దొరకటం ఎంత కష్టమోనీకు తెలీదు. అందువల్లనే నువ్వు అలా అనుకుంటున్నావు. నేను స్కూలు నిర్వహించే తీరులో, ఎంట్రెన్సు కోచింగ్ ఇచ్చే విధానంలో లోపం వుందంటున్నావు. సరే ఒప్పుకుంటాను, రెసిడెన్షియల్ సదుపాయాలు కూడా పెట్టి వెయ్యేసి రూపాయలు కోచింగ్‌కు వసూలు చేస్తున్న పెద్ద పెద్ద పేరున్న ఏ కోచింగ్ సెంటరూ కూడా తన వంతుగా ముప్పయిసీట్లు కంటే ఎక్కువ పొందలేక పోతోంది. మరి దానికేమంటావ్” కాస్త గట్టిగానే అడిగేను. అతడు కొంతసేపు తలపంకిస్తూ వుండిపోయి తర్వాత అడిగేడు.

“విశాఖపట్నం జనాభా ఎంత?”

“పదిలక్షలు దాటింది”

“ఈ పదిలక్షలలో తమ పిల్లల్ని మంచిస్కూళ్ళల్లో చేర్పించి డబ్బుకట్టి చదివించగల స్తోమతవున్న తల్లితండ్రులు కనీసం పదివేలమందయినా వుంటారు. అంటే నాలుగు వందల సీట్లకోసం పదివేల మంది పోటీ పడతారన్నమాట. అంటే పాతిక మందిలో ఒకరికే సీటు వస్తుంది. కాబట్టి అది చాలా విలువయిన సీటే. తప్పకుండా తమ కుర్రాడికి సీటు దొరుకుతుందనే నమ్మకం కల్గితే వాళ్ళు మరింత హెచ్చుమొత్తంలో డబ్బులు వెచ్చించే

అవకాశాలూ వున్నాయి." అంటూ నాతో సంభాషిస్తున్నట్లుగా మాట్లాడుతున్నాడే గానీ, వేళ్ళుమడిచి తలటొకాయిస్తూ ఏవేవో లెక్కలు తనలో తానే వేసుకుంటున్నాడు. ఈ విషయమై వాదన మరి పొడిగించటం ఇష్టంలేక మిన్నకుండిపోయాను.

"బాబూరావ్ నాబతుకు తెరువుకి ఈసారి స్థిరమైన వ్యాపారమో, ఉద్యోగమో ఎంచుకోదల్చుకున్నాను. దాని గురించి గడిచిన పదిరోజులలోనూ కొంత 'వర్కవుట్' చేశాను. త్వరలోనే ఓ రూపుదాల్చుతుందని నా నమ్మకం". అన్నాడు.

"అంతకంటే నీ శ్రేయోభిలాషులుగా మేం కోరుకునేది ఇంకేముంటుంది? విష్ యూ బెస్టాఫ్ లక్" అన్నాను. తర్వాత నిద్రకుపక్రమించేం.

మరునాడు పొద్దుటే తయారయిపోయి బయటకు వెళ్ళిపోయిన ధర్మతేజ మళ్ళీ నాలుగురోజుల వరకూ మాఇంటికి రాలేదు. ఓ సాయంకాలం స్కూలు పనిమీద జిల్లా విద్యాధికారి కార్యాలయానికి వెళ్ళేను. అక్కడ సూపరింటెండెంట్ గదిలోకి వెళ్తే, అక్కడ కన్పించేడు ధర్మతేజ. 'ఇతగాడికి ఇక్కడేంపనా?' అని విస్తుపోయాను.

"సూపర్నెంటు మునిస్వామినాయుడుగారిది మా మదనపల్లిదగ్గర పల్లెటూరే మనకి మంచి దోస్తు..." అంటూ ఆయనను మరోమారు నాకు పరిచయం చేశాడు. నేను ఆయనతో పని ముగించుకుని బయటకు వచ్చేస్తూవుంటే, "నాయుడుగారూ బాబూరావు నాకు మంచి మిత్రుడు. అతనికి ఏమైనా అవసరంపడితే నాకు సహాయం చేసినట్లే అతనికీ చెయ్యండి" అన్నాడు.

"తప్పకుండా, మీరింతలా చెప్పాలా?" అంటూ నాయుడుగారు, నా వంక ప్రేమ పూర్వకంగా చిరునవ్వు చిందించేరు.

"బాబూరావ్! ఈ నాలుగు రోజులూ పనులు తెమలక మీ ఇంటికి రాలేక పోయాను. ఈ రాత్రికి వస్తాను" అన్నాడు ధర్మతేజ.

"వెల్కం" అంటూ అక్కడ నుండి బయటపడ్డాను.

ఆ రాత్రి ఎనిమిదింటికి వచ్చేడు ధర్మతేజ. శనివారం కాబట్టి ఫలహారం బయటచేసి వచ్చేనన్నాడు. తర్వాత ఇద్దరం మాటల్లోపడ్డాం. ఈ నాలుగు రోజుల్లో ఎక్కడెక్కడ తిరిగిందీ ఎవరెవర్ని కలుకున్నదీ రేఖామాత్రంగా చెబుతూ ఆఖరున అన్నాడు 'నేను విశాఖపట్నంలో కోచింగ్ సెంటర్ ప్రారంభిద్దామనుకుంటున్నాను"

ఆ మాటలకు ముందు విస్తుపోయాను. తర్వాత సర్దుకుని మెల్లగా అన్నాను.

"ఆరు సంవత్సరాలుగా మోడలు స్కూలు నడుపుతూ నానాయతనలూ పడుతున్నాం మేం. నువ్వీరొంపిలోకి దిగకు. వ్యవహారాలు నువ్వు ఊహించినంత సాఫీగా వుండవు. ఏవేవో ఆదర్శాలుపెట్టుకుని మేం ఇందులోకి దిగేం. దిగిన తర్వాత మధ్యలో వదిలేసి

బయటకు రాలేక ఇందులోనే ఈదుతున్నాం. ఇందులో కాసులేం మిగలవు" అన్నాను.

అతడు అడుగు పెట్టేది నా ప్రపంచంలోకి అందులో నాకు కొంత అనుభవం నిపుణత వుందికాబట్టి గట్టిగానే మాట్లాడేను.

ధర్మతేజ చిన్నగా నవ్వేడు తర్వాత పుల్లతో పళ్ళు కుట్టుకుంటూ "నువ్వు ఆరేళ్ళుగా నడుపుతున్నది మోడల్ స్కూలు... నేను ఆరంభించబోయేది కేవలం కోచింగ్‌సెంటరు అది కూడా ప్రముఖ స్కూళ్ళల్లో ఫస్ట్‌స్టాండర్డ్‌కి ఎంట్రెన్స్ కోచింగ్, అంతే" అన్నాడు.

అతని తిక్క సమాధానానికి నాకు ఒళ్ళు మండిపోయింది.

"ప్రస్తుతానికి పెట్టుబడి ఏమాత్రం వుందేమిటి?" కాస్త వ్యంగ్యంగానే అడిగేను. ఇతగాడేమో బ్రీఫుకేసుతో మూడు జతల బట్టలతో విశాఖపట్నం వచ్చి కోచింగు సెంటరు ఆరంభిస్తాడా? ఇదేమయినా వీధినాటకమనుకుంటున్నాడా? వీధినాటకానికయినా ఓ వందరూపాయలు ఖర్చవుతుందే మరి? నా సహనం నశిస్తోందని అతనికి అర్థమయిపోయింది.

అయినా తన ధోరణిలోనే "ప్రస్తుతం ఎనిమిది వందలుంది మీ ఇంట్లో వుంటున్నాను కనుక లాడ్జింగు ఖర్చులేదు. రాబోయే పదిరోజులలో తిండికి మరో నాలుగు వందలు ఖర్చయిపోతే ఇంకో నాలుగు వందలు మిగుల్తుంది నాదగ్గర" అంటూ కాస్సేపాగి "నాలుగు వందలతో కోచింగ్ సెంటర్ ఆరంభించలేంకదా" అన్నాడు.

నాకు తిక్క రేగిపోతోంది. అతనితో ఆ సంభాషణ పొడిగించటం వ్యర్థమనిపించింది. "విష్ యూ బెస్టాఫ్ లక్! గుడ్‌నైట్" అంటూ లేచాను అక్కడనుండి

"బాబూరావ్ నా ప్లాను ఇంకా పూర్తిగా రూపుదిద్దుకోలేదు. ఓ వారం తర్వాత నీకు వివరంగా చెబుతాను. అంతవరకూ నువ్వు మరోలా అనుకోవద్దు" అన్నాడు.

"నో నో నాటెటాల్! నువ్వు చేతులు కాల్చుకోకుండా బయటపడి నాలుగు డబ్బులు సంపాదించాలనే నేను కోరుకుంటున్నాను. వేసే అడుగు మాత్రం జాగ్రత్తగా వెయ్" అంటూ ఇంట్లోకి వచ్చేశాను.

నిద్రకుపక్రమిస్తూ లక్ష్మికిఈ సంగతులన్నీ వివరించేను. అంతావిని "ధర్మతేజకి పొగరు జాస్తి అని మా ఆడవాళ్ళందరం అనుకునే వాళ్ళం. అంతేకాదు ఉసిరికాయంత వెర్రికూడా వున్నట్లుంది అతనికి" అంటూ అవతలివైపుకు తిరిగి పడుక్కుని నిద్రలోకి జారిపోయింది.

ఆ తర్వాత వారం రోజుల్లో ఒక్కరాత్రి మాత్రమే మా ఇంటికి వచ్చేడు ధర్మతేజ. అతని మాటలను బట్టి కోచింగ్ సెంటర్ ఆరంభించటానికి చాలా పట్టుదలతో పనిచేస్తున్నట్లు నాకు అర్థమయింది.

మరో నాలుగు రోజులు పోయాక ఓ రోజున ఓ కార్డు తెచ్చి చిర్నవ్వుతో నాకు అందించేడు ధర్మతేజ 'ధర్మతేజ కోచింగ్ సెంటర్' అనే బంగారు రంగు అక్షరాలు తెల్లని కార్డుమీద తళతళా మెరిసిపోతున్నాయి. కార్డు మడత విప్పి చదివేను మరునాడే ప్రారంభోత్సవం!.

స్థానికంగా ఎమ్మెల్యేగా గెలిచి ఆ మధ్యనే మంత్రిగా మారిపోయిన ఓ కాంట్రాక్టరు పొద్దుట తొమ్మిది గంటలకు రిబ్బను కత్తిరించి ప్రారంభోత్సవం చేస్తారు. కలెక్టరుగారు ప్రారంభోపన్యాసం. ఓ బడారాజకీయ నాయకుడు సభకు అధ్యక్షత వహిస్తాడు. విశ్వవిద్యాలయంలో ఓ ప్రముఖ ప్రొఫెసర్‌గారు వచ్చి ముఖ్యోపన్యాసం చేస్తారు. ఇలా వివరాలన్నీ ఆ కార్డులో వున్నాయి. కోచింగ్ సెంటరు కూడా ఊరికి నడిబొడ్డునే వున్న ద్వారకానగర్‌లోని ఆలేఖ్యాపేలస్ మొదటి అంతస్తులో.

నాకు కళ్ళుతిరిగి నట్లయింది కొంతసేపు.

తర్వాత తమాయించుకుని అన్నాను. "మొత్తానికి అసాధ్యుడివే, కంగ్రాట్స్".

"థేంక్యూ! చాలాపనులు మిగిలిపోయాయి. తర్వాత వివరాలు మాట్లాడతాను" అంటూ వచ్చినంత హడావుడిగానూ వెళ్ళిపోయాడు.

కార్డులోని వివరాలన్నీ రెండుసార్లు చదివేను కానీ ఈ వ్యవహారం మీద నాకు పూర్తినమ్మకం కలగలేదు. కానీ మరునాడు నా అంచనాలు తప్పయ్యాయి. ధర్మతేజ నిజంగానే అసాధ్యుడనిపించేడు నాకు.

మంత్రిగారి రిబ్బను కటింగుతో పెద్ద ఆర్భాటంతో, కోలాహలంతో మరునాడు ధర్మతేజ కోచింగ్ సెంటరు ప్రారంభోత్సం జరిగింది. ఓ శాసనసభ్యుడు ధర్మతేజను ఓ మహోన్నత వ్యక్తిగా అభివర్ణించాడు. విద్యారంగానికి అతనిసేవలు చాలా అవసరమనీ, ఇటువంటి వ్యక్తులు ఇంకా చాలా మంది విద్యారంగంలోనికి అడుగుపెట్టి ఆ రంగాన్ని సుసంపన్నం చేయవలసిన అవసరం ప్రస్తుత పరిస్థితులలో ఎంతయినా వుందనీ నొక్కి వక్కాణించేడాయన.

విద్యాదానం అన్ని దానాలలోనూ గొప్పదానమనీ, అందుకు పూనుకున్న ధర్మతేజను అందరం అభినందించాలనీ కలెక్టరుగారు అన్నారు. యూనివర్శిటీ ప్రొఫెసరు గారయితే ధర్మతేజను ఆకాశానికే ఎత్తేశారు. సభ చివరలో ధర్మతేజ మైకు ముందుకు వచ్చి అందరకూ వినమ్రంగా నమస్కరించేడు. తర్వాత గొంతు సవరించుకుని "నాకు ఈ అపూర్వ అవకాశం కలుగజేసిన విశాఖ పట్టణ ప్రజలకు నేను ఋణపడి వుంటాను. మొట్టమొదటి రెండు నెలల్లోనూ ప్రముఖ స్కూళ్ళల్లో ఫస్ట్‌స్టేండర్డ్ సీట్లకోసం జరిపే ఎంట్రెన్స్ టెస్టుకు మాత్రమే కోచింగ్ ఇప్పిస్తాను. తర్వాత అలా అలా పై క్లాసులు కూడా ప్రారంభిస్తాం.

మొదటి విడతగా ఈ మొట్టమొదటి బేచ్‌లో పదిమంది బీద విద్యార్థులకు పూర్తిగా ఉచితంగా శిక్షణ కల్పిస్తాను. నిజమైన బీద పిల్లలను ఏరి నా వద్దకు పంపవలసిందిగా సభలోని విద్యాశాఖాధికారిగారికి విజ్ఞప్తి చేస్తున్నాను". అతడు మాట్లాడుతూ వుండగానే సభలో చప్పట్లు మిన్నంటేయి.

సభ ముగిసింది.

ధర్మతేజ హడావిడిగా వుండటం వలన అతన్ని కల్సుకోకుండానే తిరిగి ఇంటికి వచ్చేశాను. ఇంటికి వచ్చేసి ఆలోచనలో పడ్డాను. ఈ పదిహేను రోజులవ్యవధిలోనూ ధర్మతేజ వ్యవహారాలన్నీ బాగానే 'వర్కవుట్' చేశాడనిపించింది. అతనికి ఈ పట్టణంలో గల 'కనెక్షన్లకీ' ఆశ్చర్యం కల్గింది. 'పదిమందికి ఉచితంగా శిక్షణ ఇస్తూ ద్వారకానగర్‌లాంటి ప్రాంతంలో కనీసం అయిదువేల రూపాయలవరకూ అద్దెచెల్లిస్తూ, ఉపాధ్యాయులకు వేతనాలిస్తూ, ఇంత అర్భాటంగా డబ్బులు ఖర్చుపెడుతూ ఏమి మిగుల్చుకోగలడు?' అనే నా అనుమానం మాత్రం నివృత్తికాలేదు.

మరునాడు తెలుగుపేపరు లోకల్ పేజీలో ధర్మతేజ కోచింగ్ సెంటరు ప్రారంభోత్సవం గురించి డబుల్ కాలమ్ హెడ్డింగు పెట్టి మరీ రాశారు. ధర్మతేజను విద్యారంగంలో ఓ ధర్మమూర్తిగా ఆపేపరు అభివర్ణించింది. ఆ తర్వాత పేజీలో రంగులలో ధర్మతేజ కోచింగ్ సెంటర్ ప్రకటన కూడా దర్శనమిచ్చింది. 'పిల్లల చదువుకోసమేనా మీచింత! ధర్మతేజ కోచింగ్ సెంటర్ వున్నది మీచెంత' అనే నినాదంతో ప్రముఖ స్కూళ్ళల్లో సీటు దొరక్కపోతే మీకోచింగ్‌కి కట్టిన డబ్బులు వాపస్ ఇస్తాం' అంటూకూడా రాశారు. ఇంకా బోలెడు వాగ్దానాలు ఆ ప్రకటనలో గుప్పించేరు. ఆ ప్రకటనకు కనీసం అయిదు వేలయినా ఖర్చయివుంటుంది అని నా అంచనా.

తర్వాతి రోజుల్లో ధర్మతేజ మరి నాదగ్గరకు రాలేదు. పూర్తి వివరాలు తెలియక పోయినా, కోచింగ్ సెంటరు మాత్రం బాగానే నడుస్తోందని విన్నాను. మా స్కూలు వుండేది పూరి శివార్లలో. అక్కడ నుండి ద్వారకానగర్ పన్నెండు కిలోమీటర్లు. అందులన నేను కూడా మళ్ళీ అటువైపుకు వెళ్ళలేకపోయాను. పనిగట్టుకుని వెళ్ళి ధర్మతేజను పలకరించి వచ్చే తీరికా లేకపోయింది. 'ఎప్పుడో అతడే హఠాత్తుగా ఊడిపడి వివరాలన్నీ చెబుతాడులే. అని మిన్నకుండిపోయాను. అతడికోచింగ్ సెంటర్‌లో విద్యార్థులు ముమ్మరంగానే చేరుతున్నారని కర్ణాకర్ణిగా విన్నాను.

మా స్కూలులో నిర్వహించే ఎంట్రెన్స్ కోచింగ్ హడావిడిలో పడి బిజీ అయిపోయాను. మూడునెలలు ఇట్టే గడిచిపోయాయి. ఈసారి మేం ఇచ్చిన కోచింగ్ బేచ్ పూర్తిగా విఫలమయిపోయింది. పాతికమందిని తయారుచేసి పంపితే, అక్స్‌ఫర్డ్

స్కూలులో ఒక్క చిన్న కుర్రాడికి మాత్రమే సీటు వచ్చింది. అంతే.

నాకు ధర్మతేజ గుర్తుకువచ్చేడు. మళ్ళీ అతడి కోచింగ్ సెంటరు గురించి ఆరాతీశాను. అక్కడ నూట పదిమంది చదివితే వారిలో తొంభయి ఎనిమిదిమందికి ప్రముఖ స్కూళ్ళలో ఫస్టుక్లాసులో సీట్లు వచ్చేయట. నాకు నిజంగానే మతిపోయినట్లయింది. ధర్మతేజ మొదటి రోజున నాతో అన్నమాటలు గుర్తుకు వచ్చేయి.

"నువ్వు స్కూలు నిర్వహించే తీరులో ఏదో లోపం వుంది". పదే పదే అవే మాటలు నా చెవుల్లో సుడులు తిరిగేయి! 'నిజంగానే నా నిర్వహణలో లోపంవుందా? వుంటే అదేమిటి? నేను ఇంతకాలం ఈ ఫీల్డులో వుండి ఎందుకు సరిదిద్దుకోలేకపోయను? అసలా లోపం ఏమిటి?' అనే ప్రశ్నలు నన్ను వేధించసాగాయి.

మర్నాడు మధ్యాహ్నం బయలుదేరి ధర్మతేజ వద్దకు వెళ్ళాను. కానీ నేను వెళ్ళేసరికి ఆ కోచింగ్ సెంటరుకు తాళం పెట్టివుంది. ఎవ్వరూ కనబడలేదు. పై అంతస్తులో వుండే ఆ బిల్డింగు యజమానిని కలిశాను. ఎంట్రెన్సు వ్యవహారాలు అయిపోయాక ఫలితాలు వచ్చేసిన మరునాడే ధర్మతేజ తన స్వగ్రామానికి వెళ్ళిపోయాడట. అద్దెపూర్తిగా చెల్లించి, బిల్డింగు ఖాళీ చేశాడట. త్వరలో మళ్ళీ వస్తాననీ, కానీ తనకోసం ఎదురు చూడకుండా 'మంచిపార్టీ వస్తే బిల్డింగు అద్దెకు ఇచ్చేసుకోండి' అనిచెప్పి మరీ వెళ్ళాడుట. "ఇంక ఆయన రాడేమోనని అనుకుంటున్నాను" అంటూ ముక్తాయించేడు ఇంటి ఓనరు.

అతడి మాటల మీద పూర్తి నమ్మకం కుదరక "మీ బాకీలన్నీ తీర్చేశాడా?" అంటూ అనుమానంగా అడిగేను.

"ఆహా డబ్బుదగ్గర చాలా ఖచ్చితమయిన మనిషి అద్దెకాకుండా ఇలా అర్థాంతరంగా ఖాళీ చేస్తున్నందుకు మరోనెల అద్దె బోనస్‌గా ఇచ్చి వెళ్ళేడు. నిజంగా మహానుభావుడు" అంటూ రెండు చేతులూ ఎత్తి అక్కడలేని ధర్మతేజకు గాలిలోనే నమస్కరించేడు. నేనింక మాట్లాడకుండా ఆయన వద్ద శెలవుతీసుకుని ఇంటికి తిరిగి వచ్చేశాను. ఈ వ్యవహారం గురించి ఆలోచించిన కొద్దీ నాకు బుర్ర పాడయిపోతోంది.

ధర్మతేజ కోచింగ్ ఇచ్చింది నూట పదిమందికి. అందులోనూ బీద విద్యార్థులు పదిమంది. మిగిలిన వందమంది నుండీ మనిషికి అయిదు వందల చొప్పున అతడికి లభించిన ఫీజు యాభయివేలు. ప్రారంభోత్సవ ఖర్చులూ, పేపరు ప్రకటనలూ ఇవన్నీ కలిపి కనీసం పాతిక వేలయివుంటాయి. బిల్డింగుకి పదహారువేలు దొరికినట్లు ఓనరే చెప్పేడు. అక్కడికే నలభైఒక్కవేలు. టీచర్ల జీతాలు, అద్దె ఫర్నిచరూ, స్టేషనరీ ఖర్చులు ఇవన్నీ మిగిలిన తొమ్మిదివేలల్లోనూ ఎలా భరించగలిగాడు? అదీ కాక ఈరెండు నెలలూ పిల్లలను తీసుకువచ్చి తిరిగి దిగబెట్టటానికి ఓ బస్సును కూడా ఉచితంగా తిప్పేడుట.

దానికి కనీసం ఇరవైవేలయినా అయివుండాలి. ఇదంతా ధర్మతేజకు ఎలా సాధ్యమయింది? ఎన్నో అంతుబట్టని ప్రశ్నలు. సమాధానాలు మాత్రం దొరకలేదు.

రోజులు దొర్లిపోతున్నాయి.

ధర్మతేజ గురించిన వివరాలు ఏమీ తెలియలేదు. మా మోడలు స్కూలులో వేయించిన 'బోరు' వట్టిపోయింది. నీళ్ళురావటం లేదు. ప్రభుత్వ గ్రాంటులు కూడా ఎంత ప్రయత్నించినా రావటంలేదు. నీరులేక పాదులూ, మొక్కలూ అన్నీ నాశనమయిపోయాయి. మా ఆవరణలో పచ్చదనమంతా మళ్ళీ వేసవి వచ్చేసరికి హరించుకుపోయింది.

ఊళ్ళో కొత్తకోచింగు సెంటర్లు తామరతంపరగా పుట్టుకు రావటంతో మా స్కూలుకు వచ్చే పిల్లల సంఖ్య కూడా క్రమేణా తగ్గిపోతోంది. నేను సరిగ్గా జీతాలు ఇవ్వలేకపోవటం వలన ముగ్గురు టీచర్లు మానేశారు. వాళ్ళని మాత్రం ఏమని తప్పుపట్టగలను? గాలిని భోజనం చేసి వాళ్ళు పాఠాలు చెప్పలేరుకదా. ఏతావాతా నేనూ, లక్ష్మీ కాక మరో ఇద్దరు ఉపాధ్యాయులు మాతో మిగిలేరు. మెట్రిక్ పరీక్షల పైన మాత్రమే శ్రద్ధపెట్టి మిగిలిన క్లాసులన్నీ ఒక్కటొక్కటిగా ఎత్తేశాం.

చూస్తుండగానే మరో మూడు సంవత్సరాలు దొర్లిపోయేయి. ఇలా వుండగా ఓరోజు రాఘవయ్యగారు మా స్కూలుకు వచ్చేరు. ఆయన మావూళ్ళోని పెద్ద ఆయిలు కంపెనీకి జనరల్ మేనేజరు. వాళ్ళ అబ్బాయి మా స్కూలులో మెట్రిక్ కోచింగ్ తీసుకుని జిల్లా విద్యార్థులలో ప్రథమంగా నిలిచాడు. ఫలితాలు వచ్చేక ఆయన స్వయంగా వచ్చి నాకు లక్ష్మికి  ఇతర టీచర్లు ముగ్గురికీ బట్టలుపెట్టి సత్కరించి తన ఆనందాన్ని వ్యక్తం చేశారు, పదిరోజుల క్రితం.

ప్రస్తుతం ఆయనవచ్చిన పనివేరు. వాళ్ళబ్బాయిని గుంటూరు తీసుకువెళ్ళి రెసిడెన్షియల్ స్కూలులో ఇంటర్మీడియట్‌లో చేర్చే పనిలో వున్నారట. ఇంటర్‌తోపాటు ఇంజనీరింగ్ ఎంట్రెన్స్ కోచింగ్ కూడా అక్కడ మొదటి రోజునుండే ఆరంభిస్తారట. ఆ ఆ రాత్రికే వాళ్ళ అబ్బాయిని తీసుకుని గుంటూరు బయలు దేరుతున్నారట. కుర్రాడి మెడికల్ టెస్టు ఇతర వ్యవహారాల గురించి అక్కడ రెండు మూడు రోజులు వుండవలసి వస్తుందట. అయితే ఆయనకి అర్జెంటు మీటింగులు వున్నాయి కాబట్టి నేను కూడా ఆయనతో బయలుదేరి వస్తే, అవసరాన్ని బట్టి నన్ను, కుర్రాణ్ణి గుంటూరులో వదిలేసి కారు కూడా మాకు వదిలేసి, ఆయన తిరిగి విశాఖవచ్చేస్తారుట. తనకీ సహాయం ఎలాగయినా చెయ్యాలని బ్రతిమాలేడాయన. పెద్దాయన మాటకొట్టిపారెయ్యలేక ఒప్పుకున్నాను.

ఆ రాత్రే కారులో ముగ్గురం డ్రైవరుతో సహా బయలుదేరి మర్నాడు పొద్దుటికి గుంటూరు చేరుకున్నాం. గుంటూరులో ఓ హోటల్లో దిగి కాలకృత్యాలు తీర్చుకుని తొమ్మిది గంటలకు బయలుదేరి అమరావతిరోడ్డులో వుండే ఆ రెసిడెన్షియల్ స్కూలుకు చేరుకున్నాం.

సువిశాలమయిన ప్రహరీ మధ్యలో ఎత్తైన భవనాలతో కళకళలాడిపోతోంది ఆస్కూలు. ఖరీదయిన టెరికాట్ యూనిఫారాల్లో విద్యార్థులు సందడిగా తిరుగుతున్నారు. మేం వెళ్ళేసరికి పార్కింగు స్థలంలో సుమారు ముప్ఫయి వరకూ కార్లు ఉన్నాయి. అక్కడ ఖాళీదొరక్క మా డ్రైవరు కారును ఆవరణ బయటకు తీసుకువచ్చి చెట్టునీడలో పార్కింగు చేశాడు.

కారు దిగి గేటుదాటిలోనికి వెళ్ళి వెయిటింగ్ హాలుకు చేరుకున్నాం. పాలరాతి గచ్చుతో ఖరీదయిన రంగులు పులిమిన గోడలతో హాలు ఇంద్రభవనంలా మెరిసిపోతోంది. దానికి ఆనుకుని కాలేజీ డైరెక్టరుగారి ఏ.సి.గది వుంది. బయట డి.టి.పన్నాల్ అని వ్రాసి వున్న ఆయన నేమ్‌ప్లేట్ – బంగారు రంగు మెటల్ అక్షరాలు అతికించిన పాలరాతి బోర్డు – వేలాడుతోంది.

మేం హాలులో కూర్చున్న పావుగంట తరువాత ఆయన పర్సనల్ సెక్రటరీ కాబోలు ఒకామె వచ్చి మానుండి విజిటింగ్ కార్డు తీసుకుని లోనికి వెళ్ళిపోయింది. మరో పావుగంట తర్వాత ఆమే స్వయంగా వచ్చి మమ్మల్ని లోనికి తీసుకువెళ్ళింది.

అందమైన ఆ అతి చల్లని గదిలోకి అడుగుపెట్టి బ్రహ్మాండమైన ఎగ్జిక్యూటివ్ చైర్‌లో ఫుల్‌సూటులో విలాసంగా ఊగుతూ కాగితాలు తిరగేస్తున్న వ్యక్తిని చూడగానే ఉలిక్కిపడ్డాను.

అతడు ధర్మతేజ!. నన్నుచూడగానే కొద్దిసెకన్లు తొట్రుపడినా, అంతలోనే సహజసిద్ధమయిన నవ్వును పెదాలను చెవులవరకూ చీల్చుతూ బయటపెట్టాడు. "ఎలా వున్నావ్?" అంటూ నన్ను పలకరించి నా సమాధానం కోసం ఎదురు చూడకుండానే రాఘవయ్యగారి వంకకు తిరిగి "చెప్పండి" అంటూ వ్యాపారంలోకి దిగిపోయాడు. తర్వాత క్లుప్తంగా కాలేజి నిబంధనల గురించీ ఫీజులగురించీ చెప్పాడు. అన్నిటికీ తలవూపేరు రాఘవయ్యగారు. సాయంకాలం నాలుగున్నరకు రెసిడెన్షియల్ హాస్టలు వెనుక డిస్పెన్సరీకి వస్తే కుర్రాడికి వైద్య పరీక్షలు నిర్వహించి, సీటు సంగతి ఖాయంచేసి తర్వాత ఫీజు కట్టించుకుంటానని చెప్పేడు ధర్మతేజ. చివరగా "రాఘవయ్యగారూ మీరు మీ కుర్రాడి గురించి ఏమీ బెంగపెట్టుకోకండి మీ వాడికి ఇంజనీరింగ్‌లో సీటు వచ్చేలా చూసే బాధ్యత నాది. మా హాస్టలు చాలా బాగుంటుంది. రోజూ పళ్ళూ, పాలు కూడా ఇస్తాం.

ఇంటి భోజనానికి తక్కువ కాకుండా పదార్థాలన్నీ రుచికరంగా వుంటాయి. మా హాస్టలు మెస్‌లో కాలేజీ డాక్టరు ప్రతినెలా మీకుర్రాడికి వైద్యపరీక్షలు నిర్వహించి హెల్త్‌కార్డు నింపి మీ చిరునామాకు పంపిస్తారు. ఈ రెండు సంవత్సరాలూ మీ కుర్రాడి సంగతి మాకు వదిలెయ్యండి" అన్నాడు ధర్మతేజ.

రాఘవయ్యగారు ధర్మతేజకు చేతులెత్తి నమస్కరించేరు.

"మీరు బయట హాలులో వెయిట్ చెయ్యండి బాబూరావుని అయిదు నిమిషాలలో పంపిస్తాను. అతడు నా చిరకాలమిత్రుడు" అంటూ నవ్వేడు ధర్మతేజ.

రాఘవయ్యగారు కుర్రాణ్ణి తీసుకుని బయటకు వెళ్ళిపోయారు.

ఇదంతా 'కలయో... వైష్ణవమాయయో...' అనుకుంటూ గదిగోడల వంక పరికిస్తూ వుండిపోయాను. నాకేం మాట్లాడాలో తోచటంలేదు. ధర్మతేజ 'మేన్ ఆఫ్ ఏక్షన్' అనిపించింది.

"బయట బోర్డుమీద 'డి.టి.పన్నాల్' అని వుందేమిటి?" అన్నాను, సంభాషణ ఎలా ప్రారంభించాలో తెలియక.

"నా పూర్తిపేరు పన్నాల ధర్మతేజ. దాన్ని డి.టి. పన్నాల్‌గా మార్చేను విశాఖపట్నం నుండి నీతో చెప్పకుండా వచ్చేశాను. సారీ" నొచ్చుకుంటున్నట్టుగా అన్నాడు.

"పరవాలేదులే కానీ నువ్వు నాతో అబద్ధం చెప్పటమే కాస్త బాధకల్గించింది" అన్నాను. మూడు సంవత్సరాలుగా ఏమూలనో ధర్మతేజ మీద దాగివున్న కోపం అలా బయటపెట్టక ఊరుకోలేక పోయాను.

"నీతో అబద్ధం ఏంచెప్పేను?" ఆశ్చర్యంగా నా వంక చూసేడు.

"మా ఇంట్లో తొలుత కూర్చున్నపుడు నువ్వేం చెప్పేవ్? ఆవేళ?

"ఏం చెప్పేను?"

"నీ దగ్గర ఇంక ఎనిమిది వందలే వున్నాయనీ, నాలుగు వందలు తిండికి పోతే ఇంకా నాలుగు వందలే మిగిలి వుంటాయనీ, వాటితో కోచింగ్ సెంటర్ ప్రారంభించటం సాధ్యమా? అంటూ అడిగేవు. అవునా? కానీ వారంరోజులు తిరక్కుండానే ఆర్భాటంగా ప్రారంభోత్సవం, అన్ని హంగులతో కోచింగ్ సెంటర్ నడపటం. ఇవన్నీ ఎలా చేశావ్? ఎలా చూసినా రెండు మూడు నెలల్లో నీ ఖర్చులు యాభయి అరవై వేలకు పైగానే అయివుంటాయి. డబ్బులేకుండా నువ్వు చెప్పిన కేవలం నాలుగు వందల రూపాయలతో ఇవన్నీ ఎలాసాధ్యం అయ్యేయి?"

నా అక్కసు బయటపెట్టినా; గొంతులో కోపం, నిష్ఠూరం, ధ్వనించకుండా నవ్వుతూ మార్దవంగానే అడిగాను.

ధర్మతేజ తేలిగ్గా నవ్వేశాడు. తర్వాత బెల్లునొక్కి సెక్రటరీని పిలిచి మరో పది నిమిషాల వరకూ లోపలకు ఎవర్నీ పంపవద్దని చెప్పేడు. "అలాగే సార్" అంటూ ఆ అమ్మాయి వెళ్ళిపోయింది.

ప్రక్కనే టేబిలు మీద ప్లాస్కు అందుకుని అందులోని కాఫీ రెండు కప్పులలో తానే స్వయంగా పోసి నాకొకటి అందించి తానొకటి తీసుకున్నాడు.

ఇద్దరం కాఫీలు త్రాగటం ముగించేం.

కాఫీకప్పు ప్రక్కన పెడుతూ అన్నాడు ధర్మతేజ "బాబూరావ్ నేను నీతో అబద్ధం చెప్పలేదు. ఆవేళ్టికి నిజంగా నా వద్ద మిగిలివున్నవి ఎనిమిది వందలే"

ఆ తర్వాత కొంతసేపు మౌనంగా వుండి పోయాడు

అతని వంక నమ్మలేనట్లు చూస్తూ నేను కూడా ఏమీ మాట్లాడలేదు.

మళ్ళీ అతడే అన్నాడు "ఆ పదిహేనురోజుల్లో ఓ నాలుగు బ్యాంకుల్లో నలుగురు మిత్రులద్వారా క్రెడిట్ కార్డులు సంపాదించేను. ఓ నలభై అయిదు రోజులు వరకూ లక్షరూపాయల క్రెడిట్ కార్డుల ద్వారా దొరికింది. వందమంది పిల్లలనుండీ వసూలు చేసిన యాభయివేలతో నిర్వహణ ఖర్చులు పోగా  కొంత బాకీ తీర్చేశాను" అంటూ కొంతసేపు ఆగేడు.

"మరి నీకు మిగిలిందేమిటి?"

"సుమారు రెండులక్షలు"

అతని సమాధానానికి అదిరిపడ్డాను!. నా ముఖంలోని ఆశ్చర్యాన్ని గమనించి సంతృప్తిగా అతడు చిరునవ్వు చిందించేడు. "నీతో చెప్పటంలో తప్పులేదు. నీలాంటి స్నేహితుడి దగ్గర వాస్తవాలు దాచాలని కూడా నాకు అనిపించటంలేదు" అంటూ కాస్సేపు ఆగి మళ్ళీ అన్నాడు" కోచింగ్ సెంటరు ఆరంభించటానికి ముందే విశాఖపట్నంలోని ఆపేరుగాంచిన నాలుగు ప్రముఖ స్కూళ్ళ డైరెక్టర్లతో మాట్లాడి ఒప్పందం కుదుర్చుకున్నాను".

"స్కూలు డైరెక్టర్లతో ఒప్పందమా?" మళ్ళీ ఆశ్చర్యం ప్రకటించక తప్పలేదు నాకు.

"అవును, వాళ్ళు ఎంట్రెన్సు పరీక్షలో అడిగే ప్రశ్నలు మూడు రోజులు ముందుగానే చెబుతారునాకు. అందుకు తలోయాభయివేలూ ఇవ్వటానికి వాళ్ళతో ఒప్పందం కుదుర్చుకున్నాను. ప్రతీస్కూలులోనూ తలో పాతికసీట్లు రిజర్వుచేసుకున్నాను. విద్యార్థుల తల్లిదండ్రుల నుండి ఎంట్రన్స్‌కోచింగు ఫీజు అయిదువందలు కాకుండా సీటు గేరంటీ పేరుతో మరో అయిదువేలు వసూలుచేశాను. సీటు దొరక్కపోతే ఈ అయిదువేలూ తిరిగి ఇచ్చేసేలాగ ఒప్పందం చేసుకున్నాను వాళ్ళతో. సీటు గేరంటిగా వస్తే పదివేలయినా

ఇవ్వటానికి సిద్ధపడిపోయిన తండ్రులు ఎంతో మంది కనిపించేరునాకు. అందుకే ఈ పథకం వేశాను. ప్రస్తుత విద్యావ్యవస్థలో విలువయిన కోచింగు, సీటుగేరంటీ లభిస్తే ఎన్నివేలయినా గుమ్మరించటానికి తల్లితండ్రులు సిద్ధంగా వున్నారని నాకు అర్థమయింది. ఈ బలహీనతనే నేను 'కేష్' చేసుకున్నాను". కొంతసేపు మాటలు ఆపేడు ధర్మతేజ.

నాకళ్లెదురుగా చుక్కలు పరిభ్రమిస్తున్నట్లు అనిపించింది.

"వందమంది పేరెంట్సు నుండీ మొత్తం అయిదులక్షలు వసూలయ్యేయి అందరికీ అంటే ఒకడు మినహా మిగతా తొంభయి తొమ్మిది మందికీ సీట్లు వచ్చేయి ఆయా స్కూళ్ళల్లో. నాలుగు స్కూళ్ళ డైరెక్టర్లకీ తలో యాభయివేలు ఇచ్చేశాను, నేనిచ్చిన మాట తప్పకుండా. మిగిలిన ఖర్చులూ బేంకులో కట్టవలసిందీ పోను, నాకు రెండులక్షల పైన మిగిలింది."

మళ్ళీ మాట్లాడటం ఆపి నా రియాక్షను కోసం కాబోలు ధర్మతేజ నా వంక గుచ్చిగుచ్చి చూస్తున్నాడు.

నా ఆశ్చర్యం నుండి మెల్లగా తేరుకుంటూ అడిగేను "మరి పదిమంది బీద విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తానంటూచేర్చుకున్నావుకదా, వాళ్ళ సంగతి? వాళ్ళదగ్గర ఎలా వసూలు చేశావు?" అంటూ అడిగేను.

"వాళ్ళకి ఉచితంగా కోచింగ్ ఇస్తానని మీ అందరి సమక్షంలో స్టేజి మీద ఆవేళే చెప్పనుకదా, నేనన్నమాట ప్రకారం వాళ్ళదగ్గర పైసా కూడా తీసుకోలేదు." కాస్సేపు మాటలు ఆపి మళ్లీ తగ్గు స్వరంతో అన్నాడు "... నేను చేర్చుకున్నది నూటపదిమందిని, ఈ బీద వాళ్ల పదిమందితో కలిపి! వాళ్ళల్లో డబ్బిచ్చిన వాళ్ళలో ఒక్కడికి తప్ప తొంబయి తొమ్మిదిమందికి సీట్లు వచ్చాయి. ఈ బీదవాళ్ళు పదిమందికీ రాలేదు. నేను చేర్చుకున్న వాళ్ళందరికీ సీట్లు వచ్చేస్తే అంతా గోలయిపోతుంది. అందరికీ అనుమానం వచ్చేస్తుంది. అందుకే ఆ పదిమందీ ఫెయిల్యూర్ లిస్టులో వుంటారన్నమాట. వాళ్ళేబలిపశువులు" అన్నాడు నిర్లక్ష్యంగా.

నాకు తల తిరిగిపోయింది. నాకు ఏం మాట్లాడాలో ఎలా మాట్లాడాలో అసలేమీ అంతుబట్టలేదు. "ఈ బిల్డింగు ఖాళీస్థలం అంతా స్వంతమేనా?" అంటూ అడిగేను

"బ్యాంకులోన్లు వున్నాయనుకో కానీ స్వంతమే... మంచి స్కూలులో ఫస్టు స్టేండర్డు సీటుకోసం అయిదువేలు ఖర్చు చేయటానికి ఏమాత్రం వెనుకాడని వందలాది తల్లిదండ్రులు విశాఖపట్నంలాంటి వెనుకబడిన జిల్లాలోనే వున్నారంటే గుంటూరులాంటి ఆర్థికంగా పరిపుష్ఠికల్గిన జిల్లాలో ఇంకా ఎంత ఎక్కువ మంది వుంటారో ఊహించగలిగాను ఆరోజుల్లోనే. అందుకే విశాఖవదిలి గుంటూరు వచ్చేశాను అప్పట్లో. ఇంజనీరింగ్ లాంటి

కోర్సులో ఖచ్చితంగా సీటు వచ్చేలా చేస్తామంటే ఓ లక్షరూపాయలయినా ఇవ్వకపోతారా? అనే ఆలోచనతో వచ్చేను ఇక్కడికి. ప్రస్తుతానికి బాగానే వర్కవుట్ అవుతోంది నా పథకం" అన్నాడు.

"ఊ బాగుంది" అన్నాను ముఖం మీద చిరునవ్వు పులుముకుంటూ

"ఫీజు అయిదువేలేగానీ లక్ష ఇస్తే సీటుగ్యారంటీ ఇంజనీరింగులో. రాకపోతే డబ్బు వాపసు ఇచ్చేస్తాను నిజాయితీగా..."మాటలు ఆపి చిన్నగా నవ్వుతూ మళ్ళీ అన్నాడు

"నువ్వు నా ఆంతరంగికుడవని నమ్మి నీకీ విషయాలు చెబుతున్నాను. లేకపోతే నా ఆర్జన చూసి నేనేదో హత్యలు సాగించి ఈ డబ్బులు సంపాదించేవని అనుకుంటావని నీకు వివరాలు చెప్పేను. ఇవి మనిద్దరి మధ్యనే వుండనియ్... రాఘవయ్యగారి అబ్బాయిని సాయంకాలం మెడికల్ టెస్టుకు తీసుకువెళ్లమని చెప్పేను కదా. లక్షగురించి తేల్చుకునేదే అక్కడ జరిగే మెడికల్ టెస్టు. అక్కడ ఛీఫ్ మెడికల్ ఆఫీసరు మిస్ సుజాత ఎం.డి. త్వరలో నాకు కాబోయే శ్రీమతి" అన్నాడు.

నాకు అతని మాటలు వింటూవుంటే రక్తం మరిగిపోతోంది.

"లక్ష రూపాయలు వాళ్ళు ఇచ్చినంత మాత్రాన వాళ్ళకి ఇంజనీరింగ్‌లో సీటు ఇప్పించగలవా?అంతగేరంటీగా ఎలా చెప్పగలవు?" ఆవేశంగా అడిగేను.

"ఎందుకు తెప్పించలేను? గడచిన సంవత్సరంలో అరవై ఇద్దరు మా కాలేజి నుండి రాసేరు. ఏభయి అయిదుమందికి రేంకులు వచ్చి సీట్లు దొరికాయి."

"అదెలాగ?" ఆశ్చర్యంతో అడిగేను.

"అదంతే! నిర్వహణా సామర్థ్యం... దాన్ని గురించి మరోసారి చెబుతానులే" అంటూ సీట్లోంచి లేచాడు. నేనూ మౌనంగా లేచి బయటకు వచ్చేశాను.

"ఓ గాడ్ సేవ్ మై కంట్రీ..." అంటూ దూరంగా క్లాసు నుండి ఇంగ్లీషు పాఠం వల్లిస్తున్న కంఠాలు బిగ్గరగా వినిపిస్తున్నాయి.

★

(యువ మంత్లీ 1988)